ప్రజాశక్తి
మంగళవారం 2 డిసెంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



పోలీస్ స్టేషన్‌లో ఐజి తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు :కల్లూరు పల్లి సమీపంలో ప్రజానాట్యమండలి కళాకారుడు, సిపిఎం సభ్యులు కె.పెంచలయ్య దారుణంగా హత్యకు గురికావడం, గంజాయి మాఫియా అవినీతి అక్రమాలు జోరుగా సాగుతుండటం తదితర అంశాల నేపథ్యంలో గుంటూరు రేంజ్ ఐసి సర్వశ్రేష్ట త్రిపాటి సోమవారం నగరానికి చేరుకున్నారు. ఈ క్రమంలో చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో తనిఖీ చేశారు .రౌడీసీటర్లపై చర్యలు, నిఘా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నేరచరిత్ర కలిగిన వారికి, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. ఆయన వెంట ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల, నగర ఇన్‌ఛార్జి డిఎస్‌పి, చిన్నబజారు సిఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్టేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐజి

ప్రజా గాయకులు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య అత్యంత దారుణ హత్యకు నిరసనగా నేడు జిల్లా బంద్‌కు సిపిఎం పిలుపునిచ్చింది. వైసిపి, టిడిపితోలపాటు వామపక్షపార్టీలు సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఎంఎల్ న్యూడ్రెమొక్రసీ, బిఎస్‌పి, ఇసికె, ఎంఆర్‌పిఎస్, ఆర్‌పిఐలతో పాటు దళిత సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. నగరంలో నేడు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఆర్‌టిసి, ప్రయివేటు బస్సులు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, బంద్‌కు సంఘీబావం తెలిపాయి. పెంచలయ్య హత్య నేపథ్యంలో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. నగరంలోని రౌడీషీటర్లు పెరేడ్ నిర్వహించారు. డిఐజి శ్రీసర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్‌పి డాక్టర్ అజితా వెజెండ్ల. నగరంలో పర్యటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీని వాసరావు ఆపార్టీ నాయకులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు....

పెంచలయ్య హత్యకు నిరసనగా

నేడు జిల్లా బంద్

- ◆నగరంలో భారీ ర్యాలీ
- ◆రాజకీయపార్టీలు, ప్రజలు సంఘీభావం
- ◆ప్రభుత్వంలో కదలిక
- ◆డిఐజి, ఎస్‌పి పర్యవేక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజా నాయకులు, కళాకారులు పెంచలయ్య హత్యతో మాదకద్రవ్యాలపై ప్రజల్లో స్పందన కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు స్పందించారు. నేడు జరిగే బంద్‌కు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మద్దతు తెలిపాయి. రెండు రోజుల నుంచి బంద్‌కు సంబంధించి సిపిఎం, ప్రజా సంఘాలు, వామపక్షాలు విస్తృత ప్రచారం నిర్వహించాయి. ఆదివారం జిల్లా వ్యాపితంగా కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో మాట్లాడారు. బంద్‌కు కలిసిరావాలని కోరారు. హత్యను తీవ్రంగా ఖండించిన పార్టీలు బంద్‌కు సంఘీభావం తెలిపాయి. బంద్‌కు పెద్ద ఎత్తున ప్రజల నుంచి మద్దతు లభించింది. వర్తక, వ్యాపార సంస్థలు, సినిమా థియేటర్ల, ఆర్‌టిసి, ప్రయివేటు బస్సుల యాజమాన్యం, విద్యా సంస్థలు, హోటళ్ళు, లారీ యజమానుల సంఘాలు బందుకు మద్దతు ప్రకటించాయి. ప్రజా సంఘాలతోపాటు, ముస్లిం సంఘాలు ఆవాజ్, ఇన్సాఫ్‌తోపాటు యువజన సంఘాలు ముందుకొచ్చాయి. ఆర్‌డిటి కాలనీలో

బంద్‌కు మద్దతుగా నగరంలో సిపిఎం నిరసన ర్యాలీ

అరాచక శక్తులు, గంజాయి బ్యాచ్‌కు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు విడిచిన పెంచలయ్యకు సంఘీభావంగా ఆర్‌డిటి కాలనీ వాసులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనేందుకు ముందు కొస్తున్నారు. విద్యా సంఘాలు, యువజన సంఘాలు, రాజకీయపార్టీలు, వామపక్షాలు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఉదయం 6 గంటల నుంచి బంద్‌ను పర్యవేక్షించనున్నారు. "దిత్వా" తుపాన్ కారణంగా రెండు రోజుల నుంచి జిల్లా వ్యాపితంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షం, తుపాన్ వచ్చినా బంద్ నిర్వహించాలని వామపక్షపార్టీలు నిర్ణయించాయి. నేడు ఉదయం 11 గంటలకు నెల్లూరు నగరంలో భారీ నిరసన ర్యాలీ జరగనుంది. స్థానిక గాంధీబొమ్మ నుంచి విఆర్‌సి, మద్రాసు బస్టాండ్ మీదుగా ఆర్‌టిసి వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాపి తంగా అన్ని సంఘాలు బంద్‌కు సిద్ధమయ్యాయి..

ఇది ప్రజా ఉద్యమం -మూలం రమేష్

గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ, పెంచలయ్య గుండాల చేతిలో ప్రాణాల విడిచారని, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమ నిర్వహిస్తామని, నేడు జరిగే బంద్ అందుకు ప్రారంభమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. జిల్లా ప్రజలు బంద్‌కు పూర్తిగా సహకరించడంతోపాటు, గంజాయి, మాదకద్రవ్యాలు పూర్తిగా రూపుమాపేవరకు ఉద్యమంలో కలిసిరావాలని పిలుపునిచ్చారు. రాజకీయపార్టీలు ,పోలీసులు, ప్రజల సహకారంతో మారకద్రవ్యాలు లేకుండా చేయడానికి సిద్ధమవుతున్నారు.

బంద్‌కు వైసిపి సంఘీభావం : కాకాణి

పెంచలయ్య హత్యకు నిరసనగా నేడు నిర్వహిస్తున్న బంద్‌కు వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. పెంచలయ్య హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు హంతకులను ఖఠినంగా శిక్షించాలని కోరారు. రానున్న రోజుల్లో మారకద్ర వ్యాలను పూర్తిగా జిల్లా నుంచి తరమికొట్టాలన్నారు.

ప్రభుత్వంలో కదలికలు...!

పెంచలయ్య హత్యతో ప్రభుత్వంలో కదలికలు కనిపిస్తున్నాయి.

ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి పర్యవేక్షణ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హోం మంత్రి అనితకు లేఖ రాశారు. హత్యచేసిన వారిని శిక్షించడంతోపాటు మాదకద్రవ్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పోలీసులు స్పీడ్ పెంచారు. సోమవారం నగరంలో రౌడీషీటర్లతో పెరేడ్ నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లొద్దని ప్రతిజ్ఞ చేయించారు. గుంటూరు ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి , ఎస్‌పి డాక్టర్ అజితా వేజెండ్ల నగరంలోని పలుపోలీసు స్టేషన్లు సందర్శించి రౌడీషీటర్లు, సస్పెక్ట్, పాత నేరస్తులపై నిఘా పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకూడదని అధికారులను ఆదేశిం చారు. ఎక్కడెక్కడ గంజాయి , మాదకద్రవ్యాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుర్తించి వాటిపై దృష్టిపెట్టాలని ఐజి ఆదేశించారు. పెంచలయ్య హత్య కేసులో ఇప్పటికే ఏనిమిది మందిని అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు..

నగరంలో రౌడీషీటర్లు పరెడ్

జనాగ్రహం

పెంచలయ్య హత్యపై స్థానికుల కన్నెర్ర - నిందితుల ఇళ్లు ధ్వంసం

హత్యతో సంబంధం ఉన్న కామాక్షి, బంధువుల ఇళ్లను ధ్వంసం చేసిన దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సిపిఎం నాయకులు కె. పెంచలయ్య హత్య కేసులో ఏ1గా ఉన్న అవర కామాక్షి, ఇతర నిందితులపై జనాగ్రహం పెల్లుబీకింది. పెంచలయ్య హత్య నేపథ్యంలో జిల్లా వ్యాపితంగా భారీ సంఘీబావం వస్తుంది. నేడు బంద్‌కు పిలుపునిచ్చారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తిని గంజాయి వద్దు అన్నందుకు అత్యంత కిరాతంగా 14 మందిని హత్య చేయడంతో నెల్లూరు నగరంలోని ఆర్‌డిటి కాలనీ వాసులు రగిలిపోతున్నారు. పెంచలయ్య వీధిలోనే నివాసం ఉంటున్న జేమ్స్ ఇంటిని స్థానికులు తగులబెట్టారు. సోమవారం రాత్రి స్థానికులు జనాగ్రహానికి ఆర్‌టిడి కాలనీలోని అరవ కామాక్షి నివాసం, ఆమె సోదరులు జేమ్స్, కార్తీక్, కామాక్షి అత్త, జోసప్ ఇంటిని జెసిబిలతో పడదోశారు. కాలనీలో ఇలాంటి వ్యక్తులు ఉండడానికి వీల్లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సినీఫక్కీలో పింఛన్ సొమ్ము చోరీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : పింఛన్ పంపిణీ చేసేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న స చివాలయ ఉద్యోగి నుంచి సినీ ఫక్కీలో నగదు చోరీ చేసి న ఘటన సోమవారం చోటు చేసుకొంది. వివరాల్లోకి వె ళితే.. మండలంలోని వరిగొండ గ్రామ పంచాయతీ బిట్-1 పరిధిలో లబ్ధిదారులకు పెన్షన్స్ పంపి ణీ చేసేందుకు సోమవారం వస్తున్న సచివాలయం ఉద్యో గి (ఫిషరీస్) నుంచి గుర్తు తెలియని దుండగులు రూ. 2.15 లక్షలు దోపిడీ చేశారు. సచివాలయం ఉద్యోగి వరి గొండ దేవల్లమిట్ట ప్రాంతం నుంచి పెన్షన్స్ పంచుతూ వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో పంపిణీ చేసేందుకు రావడం జరిగింది. ఆ ప్రాంతంలో ఉన్న లబ్ధిదారు లకు పెన్షన్లు ఇచ్చి వచ్చేలోగా మోటార్ బైక్ కు తగిలించి న రూ.2.15 లక్షలతో ఉన్న డబ్బు బ్యాగ్ కనిపించలేదని సచివాలయం ఉద్యోగి చెబుతున్నారు. పెన్షన్స్ పైకం ఉన్న బ్యాగ్ దారిలో ఎక్కడైనా జారిపోయిందా ? లేదా దొంగిలించారా ? లేదా ఇంకేమైనా జరిగిందా ? లేక పోతే సచివాలయం ఉద్యోగి పెన్షన్స్ పైకంతో వస్తాడని దొంగలు ముందస్తు వేసుకొన్న పథకం ప్రకారం తస్కరించారా ? అనేవి పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. పెన్షన్ పైకం దోపిడీ ఘటన స్థానికంగా కలకలం సృష్టిస్తోంది.

అవార్డు అందుకుంటున్న ఎపిఎం

ఉత్తమ సేవా అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - లింగసముద్రం : భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణకేంద్రం డైరక్టర్, లింగసముద్రం ఎపిఎం డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావుకు రాష్ట్ర ప్రభుత్వం ఎయిడ్స్ దినోత్సవం రోజును నెల్లూరు టౌన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం ఎయిడ్స్ రోగులకు ఉత్తమ సేవలందించినందుకు గాను జిల్లా వైద్యశాఖాదికారి డాక్టర్ సుజాత జిల్లా ఎయిడ్స్ నోడలు అధికారి డాక్టర్ యస్ కె ఖాదర్ వలి ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. ఎపిఎం సింహాద్రి రావు మాట్లాడుతూ అవార్డులు బాధ్యత పెంచుతా యన్నారు. గత 30 ఏళ్లుగా రాష్ట్రంలో మెదటి సారిగా ఆదరణకేంద్రం ప్రారంభించి తద్వారా స్వచ్ఛందంగా సేవలు అందించినట్లు తెలిపారు. సింహాద్రి రావుకి పలువురు అభినందనలు తెలియజేశారు.

బంద్‌కు 139 బిసి కులాల జెఎసి మద్దతు

ప్రజాశక్తి -ఉలవపాడు :గంజాయి స్మగ్లింగ్ జరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని 139 బిసి కులాల జెఎసి రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఓ ప్రకటనలో ప్రశ్నించారు.గంజాయిపై పోరాడుతున్న సిపిఎం కార్యకర్తపెంచలయ్యను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వ వెంటనే పెంచలయ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. నేడు వామపక్షాలు ఆధ్వర్యంలో జరిగే జిల్లా బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

పింఛన్ల పంపిణీ

ఉలవపాడు : ఉలవపాడులోని మసీదు ఏరియాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లను ఎంఎల్ఎ నాగేశ్వరరావు పంపిణీ చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బం దుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలు విషయంలో చంద్రబాబు నాయుడు ఎక్కడా రాజీ పడటం లేదని తెలిపారు.ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, ఉలవపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు చిరుతోటి గిరిబాబు, పార్టీ నాయకులు ఎండి అబ్దుల్ కరీం, షేక్ బాబు, మండల మైనార్టీ అధ్యక్షుడు పటాన్ రాహుల్, ఎస్ఎం భాషా బ్రదర్స్, అబ్దుల్ ఖాదర్ ఉన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలో పందలపాడు గ్రామంలో గ్రామ సచివాలయం సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే పాల్గొన్నారు. గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ చిత్తారి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

'దిత్వా' ప్రభావం..!

- -జిల్లా వ్యాపితంగా వర్షాలు
- -రోడ్లు జలమయం
- -మరో రెండ్రోజులు ఇదే పరిస్థితి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

బంగాళఖాతంలో తీవ్ర వాయగుండగా ఉన్న దిత్వా తుపాన్‌కారణంగా సోమవారం జిల్లా వ్యాపితంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. 10 మండలాల్లో భారీ వర్షాలు జిల్లా వ్యాపితంగా 398 మిమి వర్షపాతం నమోదైంది. సరాసరి 10 మిమి కురిసింది. నెల్లూరు నగరంలోని రోడ్లు జలమయం అయ్యాయి. గాంధీబొమ్మ, కాపువీధి, కలెక్టరేట్, చిన్న, పెద్ద బజార్‌లు, భక్తవత్సలనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు చేరింది. ఆదివారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. నెల్లూరు నగరం, వెంకటాచలం, కోవూరు, నెల్లూరు రూరల్ , అల్లూరు, బోగోలు, కొడవలూరు, విడవలూరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణశాఖ తెలిపింది, నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా 200 కిమీ దూరంలో కేంద్రీకృతమై .ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల నుండి వాయుగుండ కేంద్రానికి కనీసం 40 కి.మీ. దూరంలో, తమిళనాడు-పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు సమాంతరంగా ఉత్తరం వైపు నెమ్మదిగా ప్రయాణించి ,రానున్న 12 గంటల్లో వాయుగుండం బలహీనపడే అవకాశం ఉంది.ఈ తీవ్ర వాయు గుండం సోమవారం మధ్యాహ్నం నాటికి చెన్నయ్ తీరం నుండి కనీసం 30 కి.మీ దూరంలో నైరుతి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంటుందని తెలిపారు. నేడు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురియనున్నాయి.

చెరువును తలపిస్తోన్న మాగుంట లే అవుట్ ప్రాంతం

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-నెల్లూరు :

నగర పరిధిలోని పలు పోలీసు స్టేషన్లలో నేరచరిత్ర కలిగిన వారిని, రౌడీషీటర్లగా గుర్తించబడిన వారికి పోలీసు శాఖ విభిన్నరీతిలో కౌన్సిలింగ్ ఇచ్చింది. సోమవారం పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి నేర కార్యక్రమాలల్లో తాము పాల్గొనబోమని, మంచి ప్రవర్తనతో ప్రజలతో కలిసి ఉంటామంటూ ప్రతిజ్ఞన చేయించారు. వి.ఆర్.సి సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ ఎస్‌పి డాక్టరు అజీత్ వేజెండ్ల ఆదేశాల మేరకు గంజాయి, డ్రగ్గ్ సేవించడం వల్ల కలిగే అనర్ధాలను వివరించి , వీటికి బానిసైలన వారికోసం డి అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగర పోలీసు స్టేషన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని,ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని కఠిన శిక్ష అమలు చేస్తామని హెచ్చరించారు.

పెంచలయ్య హత్యను ఖండిస్తూ

కొవ్వొత్తులతో ర్యాలీ


కందుకూరులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్రంలో గంజాయి మాఫియా ఆట కట్టించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎ పేర్కొన్నారు. పట్టణంలో గంజాయి ముఠా సిపిఎం కార్యకర్త పెంచలయ్యను దారుణంగా హత్య చేయడానికి నిరసిస్తూ పట్టణంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఎస్ఎ గౌస్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలను తీసుకొని యువత చెడిపోతుందన్నారు. పెంచలయ్య హత్య కేసులో నిందితులను శిక్షించాలన్నారు. కందుకూరు పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్ ,సిపిఐ ఏరియా కార్యదర్శి బి సురేష్, సిఐటియు నాయకులు రమేష్ ,ఎం సుధాకర్ ,ఐద్వా నాయకులు ఎస్కే మున్వీర్ సుల్తానా,ఎస్‌కె మల్లికా ఎస్.కె షాహిదా, ఎఐటియుసి నాయకులు వై ఆనందమోహన్,న్యాయవాది పి కోటయ్య పాల్గొన్నారు.

17 డివిజన్‌లో ..

ప్రజాశక్తి -నెల్లూరు : నగరంలోని గంజాయి మీద పోరాడుతున్నటువంటి సిపిఎం నాయకులు పెంచలయ్యను హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం 17 డివిజన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సిపిఎం నాయకులు కట్టా సతీష్ మాట్లాడారు. గంజాయి ముఠా ఆట కట్టించాలన్నారు. రేపు జరగబోయే జిల్లా బందును జయప్రదం చేయాలని కోరారు

బొల్లినేని సెంటర్‌లో..

గంజాయి బ్యాచ్ చేతిలో హత్య కావించబడ్డ పెంచల య్య మతి కి కారణమైన కఠినంగా శిక్షించాలంటూ 36 డివిజన్ బొల్లినేని సెంటర్ నందు నిరసన ర్యాలీ నిర్వహించారు. నేడు నిర్వహించ తలపెట్టిన జిల్లా బంద్ ను జయప్రదం చేయాలని కోరుతూ ప్రతి దుకాణం తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గం సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ కార్యదర్శి కే పెంచల నరసయ్య ,కమిటీ సభ్యులు సంపత్ కుమార్ ,25వ డివిజన్ కార్యదర్శి కష్ణమూర్తి, 36 డివిజన్ శాఖ సభ్యులు టిటిడి స్టాండ్ సభ్యులు బొల్లినేని ఆటో స్టాండ్ సభ్యులు పాల్గొన్నారు

బొల్లినేని సెంటర్‌లో..

31,32,25 డివిజన్లలో..

గంజాయి మూకల చేతిలో హత్య చేయబడ్డ సిపిఎం కార్యకర్త పెంచలయ్య హత్యకు నిరసనగా రూరల్ పరిధిలోని 31, 32, 25డివిజన్ సిపిఎం శాఖల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడారు. ఆర్డిటి కాలనీలో ప్రశాంతమైన వాతావరణ ఏర్పాటు చేసి ప్రజలను, యువకులను చైతన్యవంతం చేస్తూ గంజాయి మూకల చేతిలో హత్య హత్య గావించబడడం దారుణమన్నారు. ఈ హత్యను నిరసిస్తూ నేడు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు.నాయకులు కే పెంచల నరసయ్య ఎస్కే ఖలీల్ బి నాగేశ్వర్ రెడ్డి బి నాగేశ్వర్ రెడ్డి జబ్బర్ పెంచలయ్య షాన్వాస్ ఇక్బాల్ గోపాలు సంపత్ కుమార్ ఉన్నారు.

మాట్లాడుతున్న డిహెంహెచ్ఓ సుజాత

హెచ్ఐవి నివారణకు

అవగాహన కార్యక్రమాలు విస్తృతం

ప్రజాశక్తి-నెల్లూరు :హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో కొంత అవగహన ఉందని, ప్రజల్లో మరింత చైతన్యం కలిగించేందుకు మరిన్ని కార్యక్రమాల ద్వారా ఆ మహమ్మారిని రూపుమాపొచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి.సుజాత పేర్కొన్నారు.హెచ్ఐవి బాధితులపట్ల వివక్ష చూపొద్దని సూచించారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకోని జిల్లా లెప్రసీ,ఎయిడ్స్ అండ్ టిబి విభాగం అధికారి డాక్టరు ఎస్‌కె ఖాదర్‌వలీ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించింది. అందులో భాగంగా నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి.సుజాత జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం టౌన్‌హాలులో సభ నిర్వహించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రతి ఏడాది డిసెంబర్ 1న పపంచ ఎయిడ్స్ దినోత్సవం జరుగుతుందన్నారు.ఈ ఏడాది 'సరైన మార్గంలో హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల హక్కులని కాపాడడం ..వివక్ష లేకుండా చూడడం' అనే ప్రధాన థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మలేరియా ఆఫీసర్ హుస్సేనమ్మ మాట్లాడారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, ఎన్ఎన్‌పి ప్లస్, ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్స్ ,స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ కాలేజీల విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా టౌన్ హాలులో జరిగి కార్యక్రమంలో హెచ్ఐవి/ ఎయిడ్స్ పట్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ (పియంపి) కి ప్రశంసా పత్రం, మెమెంటోను డిఎంహెచ్ఓ డాక్టరు.

కందుకూరు :కందుకూరు టిఆర్ఆర్ పభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఎన్ఎస్ఎస్ విభా గాలు సంయుక్తంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా ఎయిడ్స్ నివారణకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్ ప్రజెంటేషన్, రంగోలి కాంపిటీషన్స్ విద్యార్థులకు నిర్వహించారు.తదుపరి విజేతలకు బహు మతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ మాట్లాడారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ అనూష మాట్లాడారు. అనంతరం మానవహారం నిర్వహించారు.ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా, డాక్టర్ కె.వి పద్మావతి , ఐక్యూ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి రాజగోపాల్ బాబు ఉన్నారు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా ల్యాబ్ టెక్నిషియన్ అసోసియేషన్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం ఏసిఎస్ఆర్ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా నూతన అధ్యక్షుడిగా బి.వి. రాజేష్‌బాబును ఎన్నుకున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల అధికారిగా పశ్చిమగోదావరి జిల్లా సెక్రెటరీ విఎన్‌విఆర్ కిషోర్, సహాయ ఎన్నికల అధికారిగా రాష్ట్ర మహిళసంఘం జాయింట్ సెక్రెటరీ లక్ష్మి సుభద్ర, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. సంఘ సెక్రెటరీ గా సి హెచ్.రత్నం, అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఎస్ డి. రసూల్ సాహెబ్, కోశాధికారిగా మహమ్మద్ షఫీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా ఎస్‌కె. మీరా మొహిద్దీన్ మహిళ జాయింట్ సెక్రెటరీ గా ఎస్. శాంతి ని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు. వి. సుజాత పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- ఉలవపాడు :మండలంలోని కష్ణాపురం పంచాయతీలో వైసిపి ఆధ్వర్యంలో సోమవారం కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయి వేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించింది.వైసిపిమండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ఫజిల్, నియోజకవర్గ ఐ.టి వింగ్ అధ్యక్షులు పాలవెల్లి అమర్నాథ్ రెడ్డి, జిల్లా బీసీ నాయకులు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య ఉన్నారు.

పలుచోట్ల పెంచలయ్యకు సిపిఎం నివాళులు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ముత్తుకూరులో..

ప్రజాశక్తి-ముత్తుకూరు : సిపిఎం యువ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్య హత్యకు నిరసనగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ముత్తుకూరు మండల కేంద్రంలో మంగళవారం బంద్ నిర్వహిస్తున్నట్లు సిపిఎం తెలియజేసింది. సోమవారం మండల కేంద్రం శ్రామిక భవనంలో పెంచలయ్య సంతాప సభ కార్యక్రమాన్ని మండల కార్యదర్శి గడ్డం అంకయ్య అధ్యక్షతన నిర్వహించగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు హాజరై ఆయనతోపాటు పార్టీ నాయకత్వం పెంచలయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోగుల శ్రీనివాసులు మాట్లాడారు. సంఘ విగ్రహ శక్తులు గంజాయి వ్యాపారానికి అడ్డుగా ఉన్న పెంచలయ్యను కుట్రపన్ని హత్య చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను సాధిస్తూ గంజాయి వ్యాపారాన్ని నిర్మూలన చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పేర్కొన్నారు. గంజాయి వ్యాపారం విద్యాసంస్థలను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. జిల్లాలో గంజాయి వల్ల 35మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. సమాజానికి మంచి చేస్తున్న ప్రజానాట్యమండలి కళాకారుడిని గంజాయి ముఠా చంపడం దారుణమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి గడ్డం అంకయ్య మాట్లాడారు. యువతలో మార్పు తీసుకుని వస్తూ ఆర్‌డిటి కాలనీలో ఎదుగుతున్న సిపిఎం నేతను చంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప కళాకారున్ని కోల్పోయామని మండల కార్యదర్శి అన్నారు. పార్టీ చేస్తున్న బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని ప్రజలు సహకారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యకాసం ఉపాధ్యక్షుడు నక్క రాధయ్య, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్, మండల వ్యకాసం కార్యదర్శి నక్క శాంప్రసాద్, సిఐటియు కోకన్వీనర్ షేక్ మస్తాన్‌షా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి : పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో గంజాయి అరాచక శక్తుల చేతులలో హత్యకు గురైన పెంచలయ్యకు పార్టీ కార్యాలయంలో ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కోడె రమణయ్య మాట్లాడుతూ నెల్లూరులోని 24వ డివిజన్ ఆర్‌డిటి కాలనీలో అరవ కామాక్షి ఆమె సోదరుడు జేమ్స్ గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారని అలాంటి వాటిని ఎదుర్కొనేందుకు పెంచలయ్య అక్కడ ప్రజల్లో గంజాయికి వ్యతిరేకంగా అవగాహన కలిగిస్తున్నారని, దానిపై కక్ష పెంచుకున్న కామాక్షి గ్యాంగ్ పెంచలయ్యను వెంబడి హత్య చేయడం జరిగిందని హత్యకు నిరసనగా రెండవ తేదీ ఉదయగిరిలో జరిగే బంద్ ను పార్టీలకు అతీతంగా ప్రజలు ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కాకు వెంకటయ్య, నాయబ్, జి.నాగేశ్వరరావు, ఫరుద్దీన్‌బాషా, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య ఉన్నారు.

పాత వెల్లంటిలో..

ప్రజాశక్తి-నెల్లూరు : గంజాయి గ్యాంగ్‌చే అతికిరాత కంగా హత్యగావించ బడిన సిపిఎం నాయకుడు, ప్రజానాట్య మండలి గాయకుడు పెంచలయ్యకు సోమవారం నెల్లూరు రూరల్ మండలం పాత వెల్లంటి గ్రామంలో పార్టీ శాఖ ఆధ్వర్యంలో సంతాపం తెలియజేశారు. ఈక్రమంలో గంజాయి, మత్తు పదార్ధాల తో యువత జీవితాలు నాశనం కాకూడదని డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తాను నివసించే ప్రాంతంలో నెల్లూరు టౌన్‌లో మత్తు పదార్ధాలు తీసుకోవద్దని అదేరకంగా అమ్మేవారు అమ్మవద్దని ప్రచారానికి నాయకత్వం వహిస్తుండే వ్యక్తి అని తెలిపారు. ఈ క్రమంలో కినుక వహించిన గంజాయి గ్యాంగ్ కల్లూరుపల్లి కాలనీ వద్ద కాపు వేసి స్కూల్ నుండి స్కూటర్‌పై తన కుమారుడుని తీసుకొచ్చే సమయంలో దాడి చేసి హత్య చేశారని, హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పెంచలయ్య మరణానికి సంతాపం తెలియ జేస్తూ వారి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. సమావేశంలో సిపిఎం నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, మండల కమిటీ సభ్యులు పల్లవరపు చెంచయ్య, పాదర్తి బోడెయ్య, నాయకులు పల్లవరపు సుబ్రహ్మణ్యం, పాదర్తి మస్తాన్, పాదర్తి పెద పెంచలయ్య, పాదర్తి మధు, తదితరులు పాల్గొన్నారు.

మాదరాజగూడూరులో సిపిఎం శాఖ కార్యదర్శి పుల్లయ్య, అడ్వకేట్ సుధీర్, సందీప్, తదితరులు పాల్గొని పెంచలయ్యకు నివాళులర్పించారు.

విపిఆర్ నేత్ర శిబిరం

ప్రజాశక్తి - ఉదయగిరి

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ నేత్ర బస్సు శిబిరంపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి, మాజీ జెడ్‌పి చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గండిపాలెం గ్రామంలో సోమవారం నేత్ర వైద్య శిబిరాన్ని మండల టిడిపి ఆధ్వర్యంలో వీరు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విపిఆర్ నేత్ర బస్సు సర్వీసుతో వరికుంటపాడు మండలంలో నిర్వహించిన 5700 మందిని పరీక్షించి అందులో 3500 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని పంచాయతీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బయన్న, విపిఆర్ ఫౌండేషన్ ఆర్గనైజర్ శంకర్, ఎంపిడిఒ బి.శ్రీనివాసులు, ఐటిడిపి ఎస్.మోహన్ రావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు నరసింహులు, యువ నాయకులు సాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల కల్పన దిశగా పలు ప్రాంతాలను సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ఉదయం 10:00 గంటలకు సందర్శిస్తారు. అనంతరం ఉదయం 11:30 నిమిషాలకు ఆత్మకూరు పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో నియోజకవర్గ పరిధిలో డిసెంబర్ మాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిఎంఆర్ఎఫ్ నిధులు సహకారంతో మంజూరు చేసిన రూ.35.51 లక్షల చెక్కులను 28మంది కుటుంబాలకు అందజేస్తారు.

గంజాయి మాఫియా ఆగడాలను అరికట్టాలి

ప్రజాశక్తి-కావలి

మూడు రోజుల క్రితం గంజాయి మాఫియా గ్యాంగ్ ఘాతుకానికి బలైన కొట్టాచిట్టం పెంచలయ్యను చంపిన దోషులను, వారి వెనుకనున్న డాన్‌లపైన కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు టి.మాల్యాద్రి మాట్లాడుతూ గంజాయి సింగిల్ నెంబర్లు జోదం కాటన్ మద్యం తదితర మత్తు పదార్ధాలు మాఫియా జిల్లాలోనూ కావలి పరిసర ప్రాంతాలలో విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారన్నారు. వాటితో విద్యార్థులు యువత చెడు దారి పడుతున్నారని తెలిపారు. ఈ డ్రగ్స్ మాఫియాల వెనక రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉన్నాయన్నారు. వారిపై ఉక్కుపాదం మోపి, తక్షణం డ్రగ్స్, గంజాయి మాఫియాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.జాన్, నరేష్ అరగల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంధమహోత్సవంలో ఎంఎల్ఎ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలోని జెండాచెట్టు వద్ద నాగూర్ మీరా స్వాముల గంధ మహోత్సవం ఆదివారం రాత్రి భక్తి పూర్వకంగా, ఘనంగా నిర్వహించబడింది. జోరు వర్షం పడుతున్న ప్రాంతమంతా పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. వేలాది మంది హిందూ – ముస్లిం భక్తులు, కుటుంబాలతో కలిసి మహోత్సవానికి హాజరయ్యారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కావలి నియోజకవర్గ ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఎల్ఎను దర్గా ప్రెసిడెంట్ ముస్తఫా, కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పూల హారాలు అందజేసి, సంప్రదాయ పద్ధతిలో పూర్ణసత్కారం చేశారు. దర్గాలో ముస్లిం పెద్దలతో కలిసి ఎంఎల్ఎ ప్రత్యేక దువా నిర్వహించి, కావలి నియోజకవర్గం ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. జోరువర్షం పడుతున్నప్పటికీ భక్తులు స్వామివారి ఆశీస్సు కోసం వచ్చినట్లు పేర్కొన్న ఎంఎల్ఎ, ముస్లిం సోదర సోదరీమణులందరికీ తనకు ఉన్న అనుబంధాన్ని మరోసారి వెల్లడించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం సోదర సోదరీమణులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-ఉదయగిరి

గండిపాలెం వెంగళరావు నగర్‌లో మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సామజాన్ని పట్టిపీడిస్తున్న వివిధ రకాల సామాజిక రుగ్మతలైన మద్యం, మత్తు పదార్థాలు ప్లాస్టిక్ నియంత్రణ తదితర అంశాలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో బి.ఎస్‌సి. (హన్స్ వ్యవసాయం) చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు గ్రామీణ పని అవగాహనా కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకం కింద ప్రత్యేక జాతీయ సేవా శిబిరం జాతీయ సేవ పథక అధికారిణి అధికారులు డాక్టర్ ఎన్.సునీత, పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక స్వచ్ఛంద సేవకులు గండిపాలెం, వెంగళరావు నగర్ గ్రామాలలో సామజాన్ని పట్టిపీడిస్తున్న వివిధ రకాల సామాజిక రుగ్మతలైన మద్యం, మత్తు పదార్థాల సేవనం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి మెర్సీ వేమూరి, వ్యవసాయ కళాశాల ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ షేక్. హీన మండల హ్యాపీ డెంటల్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ మొహమ్మద్ రుబిన ఆధ్వర్యంలో ఆరోగ్య, దంత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 100 పైచిలుకు రోగులకు మధుమేహ, రక్తపోటు, జలుబు, దగ్గు, వళ్ళునొప్పులకు, దంత సంబంధిత వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్, జెడ్‌పిటిసి రావెళ్ళ నాగేంద్ర, ఎంపిడిఒ శ్రీనివాసులు, మండల కన్వీనర్ చింతలబోయిన బయన్న, గండిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు నరసింహ రావు, ఐటిడిపి సభ్యులు సాయిశివ, డాక్టర్ పి.మాలిని, డాక్టర్ ఎం.అశోక్ నాయక్ పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ సరఫరాను అరికట్టాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టాలని వైసిపి మండల యువత, విద్యార్థి కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల యువత, విద్యార్థి అధ్యక్షులు చంద్ర నారాయణ స్వామి, గంగినేని విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ మాఫియా వల్ల బలయిన పెంచలయ్య హత్యను తీవ్రంగా ఖండించారు. మండలంలో చాపకింద నీరులా గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా ప్రబలుతుందన్నారు. యువత, విద్యార్థులు దానికి బలవుతున్నారన్నారు. వెంటనే గంజాయి, డ్రగ్స్ మాఫియాను మెట్ట ప్రాంతంలో అరికట్టకపోతే, నెల్లూరులో లాగానే జరిగే అవకాశం ఉందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం తెప్పించుకొని గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసేవాళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని, యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నర్సయ్య, సింహాద్రి, రంగస్వామి, బాల మురళియువత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-ముత్తుకూరు

ముత్తుకూరు బిసి కాలనీ నుండి మామిడిపూడి వైపుగా వెళ్లే రోడ్డును వేయాలని ఆవాజ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సాయిబాబా గుడి వద్ద నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ 34గ్రామాలకు కలుపుతున్న ప్రధానమైన రోడ్డు కొన్ని సంవత్సరాలుగా గుంతల మయం అయిపోయి విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో గుంటలు కనపడక చాలామంది పడిపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ రోడ్డు సరిగా లేకపోవడం వల్ల దాని వల్ల వచ్చే దుమ్ముతో రోడ్డు పక్కన ఉన్న షాపుల వారు కూడా అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గడ్డం మాట్లాడుతూ ప్రమాదాలకు నిలయంగా మారిన ముత్తుకూరు నుండి మామిడిపూడికి వెళ్లే రోడ్డును వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాధయ్య మాట్లాడుతూ అధికారులు వెంటనే సొరవతీసుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అక్బర్, షేక్ మోహిద్, సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, ఉపాధ్యక్షుడు షేక్ సిరాజ్, కమిటీ సభ్యులు అల్లాభక్షు, రబ్బాని, అలీ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న ఆవాజ్ నాయకులు

3న ట్రైసైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున 3వ తేదీ ఉదయం 8 గంటలకు కావలి, ఉదయగిరి, ఆత్మకూరులలో 2023 సంవత్సరంలో సెలెక్షన్ అయిన వారికి ట్రై సైకిల్ ఎలక్ట్రానిక్ వాళ్లు వీల్ చైర్లు చేతి కర్రలు సంక కర్రలు, చదువుకునే వారికి లాప్టాప్లను వెంకటాచలంలోని సిఆర్‌సి సెంటర్‌లో ఇవ్వనున్నారని వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు తెలిపారు. కనుక కావలి, ఉదయగిరి, ఆత్మకూరు సెంటర్లందు సెలెక్ట్ అయిన దివ్యాంగులు తప్పనిసరిగా వారి వస్తువులు ట్రై సైకిల్ ఎలక్ట్రానిక్ ట్రై సైకిల్ వీల్ చైర్లు చేతి కర్రలు సంఖకర్లు ల్యాప్టాప్‌లు తీసుకొనుటకు ఉదయం 8గంటలకు సిఆర్‌సిలో హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు.

పలుచోట్ల పింఛన్లు పంపిణీ

ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలతో 9వ వార్డ్ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ తెలుగు యువత అధ్యక్షులు తోట సందీప్, టిడిపి మహిళా నాయకురాలు సుమతి, కార్యకర్తలు పాల్గొన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ సురా భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు ఓ పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారివెంట చిన్నబ్బయ్య, వార్డు అధ్యక్షులు బి. శ్రీను, తదితరులు ఉన్నారు. 5వ వార్డులో వార్డ్ కౌన్సిలర్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మూడవ వార్డులో కౌన్సిలర్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో పెంచల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరాములు ఉన్నారు. రూరల్ మండలంలో నువ్వురు పాడు పంచాయతీ పరిధిలోని పాత జంగాలపల్లి గ్రామంలో టిడిపి యువ నాయకులు వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - ఉదయగిరి : కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ ప్రతి గడపలో అవ్వ తాతల చిరునవ్వుల ఆనందాలతో దీవెనలు వెల్లువెత్తుతున్నాయని మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, నాయకులు రామయ్య లక్ష్మయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని దాసరపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంను మాజీ సర్పంచ్ సయ్యద్ జమ్రుత్ జాఫర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు, టిడిపి కార్యకర్తలు, పెన్షన్ గ్రహీతలు గ్రామ మద్దతుదారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని గండిపాలెం పంచాయతీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాకంగా చేపట్టిన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.శ్రీనివాసులు, మండల కన్వీనర్ సిహెచ్ బయన్న, గ్రామ కమిటీ అధ్యక్షులు నరసింహారావు, మాజీ మండల కన్వీనర్ బొజ్జ నరసింహులు, నీటి సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, యువ నాయకులు సాయి, పెద్ద వెంకటయ్య, నరసింహ, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు 90శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్ తెలిపారు. మిక్స్‌డ్ కాలనీలో ఎఎంసి చైర్మన్ జనార్ధన్ నాయుడు, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి సికిందర్, పశు సంవర్ధక శాఖ సహాయకులు నాగరాజు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఉదయం 6గంటలకే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వారి ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు సురేష్, గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని జమ్మలపాలెంలో సోమవారం జరిగిన పింఛన్ల కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మునగాల తిరుమలరెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పులుగుంట మధుమోహన్ రెడ్డి, జమ్మలపాలెం టిడిపి నాయకులు సింగమనేని మనోజ్ కుమార్ పాల్గొన్నారు. ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు టిడిపికి చెందిన నాయకులు ప్రతి పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బందితో కలిసి తెల్లవారుజాము నుండే పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అన్నవరంలో జరిగిన కార్యక్రమంలో సిబిఆర్ చైర్మన్ పూనూరు భాస్కర్ రెడ్డి ఆ పార్టీకి చెందిన నాయకులు సచివాలయం సిబ్బందితో కలిసి జరిగిన పింఛన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కేంద్రమైన జలదంకిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పులుగుంట మధుమోహన్ రెడ్డితో పాటు ఏగూరు రఘు తదితరులు పాల్గొన్నారు.

పంటలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

దిత్వా తుపాన్ నేపథ్యంలో అధిక వర్షాలకు నష్టపోకుండా పలు పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయక్ సూచించారు. జిల్లాలో రైతులు అక్కడక్కడ బి.పి.టి. 5204 రకం వరినాట్లు వేసి ఉన్నారు. చాలావరకు వరి నారుమడి దశలోనే ఉన్నందున రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. దిత్వా తుపాన్ వల్ల నీరు 5 రోజులవరకు పొలాల్లో ఉండే అవకాశం ఉందిగనుక విత్తనం చల్లిన 2-3 రోజుల నారుమడి పొలాల్లో మళ్లి విత్తనం వేసుకోవడం మంచిది.7 రోజుల పైన వయసుగల నారు మడిలో నీరు వెంటనే తీసివేయాలి. పైపాటుగా 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా, 1 కిలో పోటాష్ వేసుకోవాలన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, ఫేస్ పెయింటింగ్, రంగోలి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, డైరెక్టర్ ఆర్.మాల్యాద్రి, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.వసుంధరదేవి, అధ్యాపకులు, విద్యార్థులు, రెడ్ రిబ్బన్ క్లబ్ మెంబర్స్ పాల్గొని జయప్రదం చేశారు.

రైతులకు సూచనలు

ప్రజాశక్తి-కావలి

ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైన సందర్భంగా కావలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఎడిఎ) సి.హెచ్. నాగరాజు వరి పండించే రైతులకు పలు సూచనలు తెలియజేశారు. రైతులు అందరు వరినాట్లు వేస్తున్న సందర్భంగా దుక్కిలో నాట్లు వేసే ముందు భాస్వరం డిఎపి ఎకరానికి 50కేజీలు లేదా ఎస్.ఎస్.పి 150కేజీలు చొప్పున ఆఖరి దమ్ములో వేయాలన్నారు.

నేటి బంద్ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజానాట్యమండలి కళాకారుడు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య హత్యకు నిరసనగా నేడు వామపక్షాలు, ప్రజా సంఘాలు తలపెట్టిన జిల్లా బంద్‌కు సిఐటియు జిల్లా కమిటీ పేర్కొన్నారు. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీవివి ప్రసాద్, గోగుల శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు వల్ల యువత పెడతోవపెట్టి భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటుందన్నారు. యువత సన్మార్గంలో నడిచే విధంగా డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. అందులో భాగంగా సిఐటియు శ్రేణులు బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

జిల్లా బంద్‌కు ఆటో కార్మిక సంఘం సంఘీభావం

గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతను ఐక్య చేసి పోరాటం చేస్తూ ఆ మాఫియా చేతిలో అత్యంత దారుణంగా హత్యగావించబడ్డ మృతుడు కె.పెంచలయ్య చిత్రపటానికి జిల్లా ఆటో కార్మిక సంఘం పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సురేష్ మారుబోయిన రాజా మాట్లాడారు. ఆటో జిల్లా కమిటీ సభ్యులు రవీంద్ర, కొర్రా హరి, జహీర్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : గంజాయి ముఠా చేతిలో ప్రజా ఉద్యమ నేత పెంచల య్య అత్యంత దారుణ హత్యకు సంగతి తెలిసిందే. అందుకు నిరసనగా ఈ నెల 2వ తేదీ మండలం నరుకూరులో బంద్ పాటిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా పిలుపునిచ్చారు. ఈ బంద్ ను మండలంలోని నరుకూరు సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కమిటీ తెలియజేశారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలో సిపిఎం నేత పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని మండల సిపిఎం కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ పిలుపునిచ్చారు. గంజాయి మూకల హత్యాకాండనను నిరసించాలన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : ఇటీవల మృతి చెందిన సిపిఎం నాయకుడు ప్రజా నాట్యమండలి నెల్లూరు రూరల్ కార్యదర్శి కె.పెంచలయ్య గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలు మాఫియాపై రాజీ పడకుండా పోరాడిన వ్యక్తి అని సిపిఎం నాయకులు గోపసాని రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జిల్లావ్యాప్తంగా జిల్లా నాయకులు బందుకు పిలుపునివ్వడంతో ప్రతిఒక్కరూ పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గంజాయి మాఫియా గుండాల చేతిలో హత్య చేయబడిన ప్రజానాట్యమండలి నెల్లూరు రూరల్ కార్యదర్శి సిపిఎం కొట్టావిట్టం పెంచలయ్యకు హత్యను ఖండిస్తూ సిపిఎం, వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు జిల్లా బందులో భాగంగా మంగళవారం ఉదయం 5 గంటల నుండి ఆర్టీసీ డిపో వద్ద బంద్ ప్రారంభమవుతుంది. ప్రజలు, ప్రజాతంత్రవాదులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు ప్రకటనలో తెలియజేశారు.

ప్రజాశక్తి-కావలి : నెల్లూరులో సిపిఎం నాయకుడు పెంచలయ్య ను గంజాయి మూకలు హత్య చేసి చంపడాన్ని ఖండిస్తూ మంగళవారం జరిగే నెల్లూరు జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఎం ఆఫీసులో సిపిఎం, సిపిఐ, ఎంఆర్‌పిఎస్ నాయకులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, పి.తిరుపాల్, వె.కృష్ణ మోహన్, సిపిఐ నాయకులు డి.దర్గాబాబు, పి.బోసు, ఎంఆర్‌పిఎస్ నాయకులు చేవూరి కిరణ్, రాపూరి శివ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు 'మునగాల' అభినందనలు

ప్రజాశక్తి-జలదంకి : జలదంకి తహశీల్దారుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీతామహాలక్ష్మికి టిడిపి మండల కన్వీనర్ మునగాల తిరుమలరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో సంస్థాగతంగా రెవెన్యూ శాఖను చక్కదిద్దాలని కోరారు. మండలంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంతోపాటు కింది స్థాయి అధికారుల్లో గురుతర బాధ్యతను పెంపొందించేల కృషి చేయాలన్నారు. అనాదిగా రెవెన్యూ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు, రైతులకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని కోరారు. కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నా సీతామహాలక్ష్మి బదిలీపై ఇక్కడి తాసిల్దార్గా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ అవసరాల దృష్ట్యా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, KALAYANI BANDI (Old Name), Resident of D.No.1-8, Vaviletipadu, Near Mahalakshmi Temple, Nellore Rural - 524002, SPSR Nellore District, A.P hereby declare that I have changed my name as

BANDI KALYANI
(New Name)
W/o BANDI
ANANTHA KUMAR REDDY
Henceforth, I will be known as
BANDI KALYANI

In the Court of the Principal District Judge : Nellore
E.P.No. 192 / 2025

ARB CASE No : ARC/FSBFL/1387/2022

M/s. **FIVE STAR BUSINESS FINANCE LIMITED,** Represented at present by Authorized Signatory **Yerramsetty Shyam Prasad,** Regional Legal Manager - D.Hr./Claimant

Vs

1. Gurram Bhuvaneshwari and another - J.Drs / Respondents

Notice

To,
JDR-1. **Gurram Bhuvaneshwari,** W/o **Koteswara Rao,**
JDR-2. **Gurram Koteswara Rao,** S/o **Gurram Satyam,** J.Drs 1 & 2 are Residents of Thallapudi, Muthukur (M), Nellore-524346.

పై నెంబరున డిక్రీ హోల్డరు జప్తుకాబడిన జె.డి.ఆర్స్ తాలూకా స్థిరాస్తిని వేలంకు కోరినందున, సదరు ఇ.పి.లో మీకు సేల్ నోటీసు (ఆర్డర్ 21 రూల్ 66 నోటీసు) నిమిత్తము **తే05-12-2025**దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సిహెచ్.సుభాషిణి, బి.ఎస్‌సి., బి.ఎల్.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

6వ తేదీకి అథ్లెటిక్ మీట్ వాయిదా..

ప్రజాశక్తి-కావలి : డిసెంబర్ 2, 3 తేదీలలో జవహర్ భారతిలో నిర్వహించాల్సిన విక్రమ సింహపురి యూనివర్సిటీ అథ్లెటిక్ మీట్ మెన్ అండ్ ఉమెన్ 2025-26 వర్షం కారణంగా 6వ తేదీకి వాయిదా వేయడమైందని విఎస్‌యు స్పోర్ట్స్ బోర్డు ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. మణికంఠ తెలిపారు. విఎస్‌యు స్పోర్ట్స్ బోర్డు, జవహర్ భారతి మేనేజ్మెంట్ డిసెంబర్ 6 తేదీన ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కావున మార్పును గమనించి క్రీడాకారులు పార్టిసిపేట్ చేయవలసిందిగా ఆయన కోరారు.

నీట మునిగిన వికలాంగుల కాలనీ



ప్రజాశక్తి-కావలి : గత 2 తుపాన్‌ల వల్ల కురిసిన వర్షాలకు కావలి పట్టణం ముసునూరు వికలాంగుల కాలనీ నీట మునిగి ఉన్నది. ఇళ్లమధ్య నిండుగా నీటి తోటి నిండిపోయి ఉన్నది. ఇళ్లల్లోకి నీరు వచ్చి కొన్ని ఇల్లు కాపురం చేసుకొనుటకు వికలాంగులకు చాలా ఇబ్బందిగా ఉన్నది. ప్రతి సంవత్సరం అదేవిధంగా జరుగుతున్నది. కొంచెం మట్టి వేసి, బజార్లు బాగు చేయట్లేదు. కొంతవరకే మట్టి వేసి, లేదా గ్రావెల్ వేసి రోడ్లు వేస్తే ఈ దుస్థితి ఉండేది కాదు. విద్యుత్ లేక వారు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ ప్రెసిడెంట్, వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు మండవ వెంకట్రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజులునుండి తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు వికలాంగుల కాలనీలోలో నిలిచిన నీరు కాళ్లు, కళ్లు లేనివారికి ఏ పరిష్కారం అధికారులు చూపించడం లేదు. ఒక పైపు వేసి ఆ పైపు పక్కన నీళ్ళు పోకుండా మట్టి వేశారు. అది ఏమని పోతే ఆ మట్టి తీసి వేయటానికి వికలాంగులు పోతే అక్కడ కొట్టు అతను తీయనియ్యలేదు. కాలువ పూడ్చేటప్పుడు మున్సిపాలిటీ వాళ్లు నీరు పోయేకలవకు అడ్డుకట్ట తీసివేయాలి కదా.. నాలుగు రోజులైనా, ఐదు రోజులైనా దివ్యాంగులమైన తాము నేలల్లో ఉండవలసిందేనా.. మా బతుకులు ఇంతేనా.. పట్టించుకోరా.. అని వాపోయారు.

విశాఖపట్నం బస్ సర్వీస్‌ను నడపాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

విశాఖపట్నంకు వెళ్లే ఆర్‌టిసి బస్సును రద్దు చేయాలని చూడడం దారుణమని దానిని అలాగే కొనసాగించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంతంలో ఉన్న ప్రజలు ఎక్కువమంది వలసలు వెళ్లి వేరే ప్రాంతాలకు పోయి సంపాదించుకుని జీవించే పరిస్థితి ఉందని, అటువంటి లాంగ్ సర్వీసులను రద్దు చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. ఈ సర్వీసును రద్దు చేయకుండా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ జోక్యం కలిగించుకొని దీనిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

టెండరు ప్రకటన
గ్రామ పంచాయతి కార్యాలయం, బూదవాడ

R.O.C.No.12/2025 తేది: **02-12-2025**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, మర్రిపాడు మండలం, బూదవాడ గ్రామ పంచాయతి నందు కాంట్రాక్టు పద్ధతిపై **మంచినీటి నిర్వహణకు పంప్ ఆపరేటర్ పోస్టు-1** మరియు **వీధి దీపాల నిర్వహణ ఎలక్ట్రీషియన్ కమ్ లైన్ ఫిట్టర్-1** పోస్టులకు 4 నెలలు అనగా **తేది: 05-02-2025 నుండి 31-03-2025** వరకు నిర్వహించుటకు **తేది: 03-12-2025** న **ఉదయం 11.00 గంటల** నుండి **మధ్యాహ్నం 2.00 గంటల** వరకు గ్రామ పంచాయతి కార్యాలయం నందు టెండర్లు నిర్వహించబడును. ఆసక్తి గలవారు **రూ.500/-** ధరావత్తు రుసుము చెల్లించి టెండర్లు దాఖలుపరచవచ్చును. మిగిలిన వివరముల కొరకు ఈ క్రింది వారిని సంప్రదించవలెను.

ఎ.వెంగయ్య, పంచాయతి కార్యదర్శి,
బూదవాడ గ్రామ పంచాయతి, మర్రిపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వింజమూరు: మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అపస్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని ఆ శాఖ అధ్యక్ష కార్యదర్శులు తెలియజేశారు. గత 25యేళ్లుగా ఉదయగిరి నియోజకవర్గం స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆపస్ ప్రతిభాపాటవ పరీక్ష టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న తెలిపారు. ఈ విద్యా సంవత్సరం కూడా జనవరి 25వ తేదీన టాలెంట్ టెస్ట్ ఎపి ఉపాధ్యాయ సంఘం నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్షలలో వంద మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయని, నియోజవర్గ స్థాయిలో టాప్‌టెన్ బహుమతులతో పాటు పాఠశాల స్థాయి ప్రథమ బహుమతి ఉంటుందని ఒక పాఠశాల నుండి పదిమంది మాత్రమే అర్హులు ప్రతి విద్యార్థికి పరీక్ష ప్యాడ్, పెన్ ఉచితంగా ఇవ్వబడునని తెలిపారు. అందరికీ భోజన వసతి ఉంటుందని, ఈ పరీక్షలు వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో ఆసక్తిగల విద్యార్థులు ఈ అపస్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభను పరీక్షించుకొని బహుమతులు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి.వెంకయ్య, డివిజన్ కార్యదర్శి కందల మధు, అధ్యక్ష కార్యదర్శులు వెంగళరావు, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ 'కాకర్ల'ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కలిగిరి: గ్రామంలో వెలసి ఉన్న శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో బాలాలయ ప్రవేశం (కళాపకర్షణ) కార్యక్రమం భక్తి భరిత వాతావరణంలో ఎంతో వైభవంగా నిర్వహించబడింది. దేవాలయం ప్రాంగణమంతా మంగళభేరి నినాదాలతో కళకళలాడింది. ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రజలకు అండగా నిలుస్తూ సేవాభావంతో ముందుకు సాగే మన ప్రియతమ నాయకులు కాకర్ల సురేష్ కలిగిరి గ్రామానికి విచ్చేసి స్వామివారి బాలాలయ ప్రవేశాన్ని ప్రత్యక్షంగా దర్శించి, ప్రత్యేక పూజలకు హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాలకు కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి -నెల్లూరు సంక్షేమం: సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె.శోభారాణి ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతీ, యువకులకు ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి పథకం ద్వారా ఈ మిషన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఒక వాహనం 5 మంది సభ్యులు ఉన్న గ్రూపునకు కేటాయిస్తామన్నారు. గ్రూపులో ఒకరికి హెవీ మోటార్ వెహికల్ ట్రైనింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సఫారీ కర్మ దారి సర్టిఫికెట్ తప్పని సరి అని సూచించారు. ఆసక్తికర లబ్ధిదారులు 04-12-2025 లోగా ఎస్సీ కార్పొరేషన్ నెల్లూరులో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

లోతట్టు ప్రాంతాల్లో సందర్శన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం :మండలంలోని జొన్నవాడ గ్రామంలో పెన్నా నది పరివాహక గిరిజన కాలనీలను తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించారు. దిత్వా తుపాన్ కారణంగా పెన్నా నది పొర్లు కట్ట తెగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత భవనాల్లో ఉండాలని వారికి సూచించారు. లోతట్టు ప్రాంతం వారు ఎటువంటి ఇబ్బందులైన ఎదురైతే వెంటనే స్థానిక విఆర్ఒకు, పంచాయతీ సెక్రటరీకి తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి-దగదర్తి

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కావలి నియోజకవర్గం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకట కృష్ణారెడ్డి ప్రజాసమస్యలపై ప్రజా దర్బార్ గ్రీవెన్స్ డే ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్నట్లు ఎంపిడిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. సమస్యలు తీరకుండా దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న వాటిని కూడా ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొస్తే వాటిని కూడా పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి-వింజమూరు

రైతులకు ఎరువులు అందజేస్తున్న దృశ్యం

రైతుల సంక్షేమమే తమ లక్ష్యం అని ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ అన్నారు. మండల పరిధిలోని చంద్రపడియ గ్రామంలో రైతులకు సబ్సిడీ ఎరువులను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వారు మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కోటిన ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన ఎరువుల పంపిణీ కార్యక్రమంలో రైతులకు అవసరమైన యూరియాను ఎరువులను స్వయంగా పంపిణీ చేశామన్నారు. రైతు అంటే దేశాన్ని పోషించే అన్నదాత వారి సంక్షేమంపై కోటిని ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని రైతులు అవసరమైన విత్తనాలు ఎరువులను సమయానికి అందే ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ముఖ్యంగా ఎరువులు విత్తనాలను సబ్సిడీ ధరలతో రైతులు చెంతకు చేరుస్తామని తెలిపారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో రెండో విడతగా రైతు బ్యాంకు ఖాతాలో రూ.7వేలు జమ చేయడం ద్వారా రైతులు పంట పంటల సాగుకు అవసరాలు కొంతమేర భరోసా కల్పించినట్టు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక పునర్నిర్మాణ అభివృద్ధి సబ్సిడీ కార్యక్ర మాలను ప్రవేశపెట్టి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా నిరంతర కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యకు పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి- నెల్లూరు అర్బన్

గత శుక్రవారం నెల్లూరు నగరంలోని కల్లూరుపల్లి ప్రాంతంలో సిపిఎం కార్యకర్త పెంచలయ్యను కొంతమంది దుండగులు అత్యంత దారుణంగా హత్య చేయడం బాధాకరమని అట్టివారిని గుర్తించి అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని వైసిపిఎస్‌సి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డైకాస్ రోడ్ లోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి స్వర్ణ వెంకయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎంబిబిఎస్ నాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ మొయినుద్దీన్ లు పాల్గొని మాట్లాడారు. ఈ హత్య సందర్భంలో కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాలను ఖండిస్తున్నామన్నారు. హత్య కేసు నిందితులు మాజీమంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి అనుచరులని కొన్ని ఫ్లెక్సీలో ఫొటోలను చూపించి ప్రచారం చేయడం దారుణమన్నారు. ఆయన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని, ఆయన ప్రాతినిధ్యం వహించిన ఏ నియోజకవర్గంలోనైనా క్రైమ్ రేట్, పోలీస్ కేసులు, రాజకీయ కక్ష సాధింపులు లాంటివి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత ఆదాల ప్రభాకర్ రెడ్డి అని వారు గుర్తు చేశారు. పెంచలయ్య హత్యను పార్టీలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. పాలకీర్తి రవి అరవ కామాక్షి 2024 సెప్టెంబర్లో తెలుగుదేశం పార్టీలో వందల మంది కార్యకర్తలతో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సమక్షంలో వారి పార్టీలో చేరారన్నారు. దానికి సంబంధించిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో చక్కరలు కొడు తున్నాయన్నారు. హత్యకు పాల్పడిన వారు ఏ పార్టీకి సంబంధించిన వారు త్వరలోనే విచారణలో తేలుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్సీ సభ్యులు కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పాశం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన జొన్నవాడ వాసులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మండలంలోని జొన్నవాడ గ్రామ వాస్త వ్యులైన పెళ్లిళ్ల మోహన మురళీకృష్ణకు,పెళ్లిళ్ల సాగర్ కు జిల్లా స్థాయిలో పదవులు దక్కాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ని నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మురళి కృష్ణను నెల్లూరు జిల్లా కార్యదర్శిగా, పెళ్లిళ్ల సాగర్ ను జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా నియమించినందు కుగాను ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ముంగర శివ కుమార్,సతీష్, రాజేష్, పాల్గొన్నారు.

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-దగదర్తి: వికలాంగులు ఒకరిపై ఆధారపడకుండా వారి స్వశక్తితో బతికేందుకు అమలు చేస్తున్న వృద్ధాప్య వికలాంగుల పెన్షన్లను ప్రతినెలా ఒకటో తేదీన కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వింజం కొండప నాయుడు తెలిపారు. కార్యక్ర మాన్ని మండలంలోని ప్రజల ఒదరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం మంగమూరు గ్రామంలో ఎన్‌టిఆర్ సామాజిక భద్రతా పథకం కింద లబ్ధిదారులకు అందించే పింఛన్లను కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సోమవారం స్వయంగా గ్రామాల్లో తిరిగి అందజేశారు. కార్యక్రమంలో బోగోలు మండలం టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, నాగులవరం సింగల్ విండో ప్రెసిడెంట్ చిలకపాటి వెంకటేశ్వర్లు, సోమశిల ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట్ల మధుబాబు నాయుడు, లేలపల్లి సుధీర్, పుంగనూరు టిడిపి సీనియర్ నాయకులు ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, సచివాలయం సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముత్తుకూరు: కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో పాటు సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తాళ్లపూడి, మల్లూరు గ్రామపం చాయతీల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు నగదు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా లబ్ధి దారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆయ నతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి: :మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం లో గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ హాజరై, స్వయంగా లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. రాజాల రత్నమ్మ భర్తకు గతంలో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ ఆయన మరణంతో నిలిచిపోయింది. కొత్తగా ప్రవేశపెట్టిన స్పౌస్ పింఛన్ పథకం కింద ఆమెకు ఆ పింఛన్‌ను కేటాయించారు. ఆ తొలి పింఛన్‌ను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆమెకు అందించాం

ప్రజాశక్తి-విడవలూరు: ఉన్నత అధికారుల ఆదేశానుసారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తమకు ఇచ్చిన బాధ్యతలను సోమవారం ఉదయం 6 గంటల నుంచే వృద్ధాప్య, విత ంతు వికలాంగు పెన్షన్లను అందజేశారు.కోవూరు శాసనసభ్యులు ప్రశాంతమ్మ ఆదేశాల మేరకు మండలంలో పెన్షన్ల పంపిణీ జోరుగా జరుగుతుంది. ప్రతి పంచాయతీలో గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్లను అందజేశారు.

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచనలతో కోవూరు గ్రామపంచాయతీ పరిధిలోని బూత్ నెంబర్ 135 లో దొమ్మర పాలెం, సాయిబాబా మందిరం వీధిలో పెన్షన్లను ప్రజలకు అందిం చారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోవూరు మండల అభివృద్ధి అధికారి చిలకల శ్రీహరి రెడ్డి, సచివా ల యం సిబ్బంది, బూత్ కన్వీనర్ నాట కరాణి వెంకట్, సెక్షన్ ఇన్చార్జులు మన్నేపల్లి బాబు, మన్నేపల్లి రాజేష్, మన్నేపల్లి శంకర్, మన్నేపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో తహశీల్దార్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :తుపాన్ ప్రభావాన్ని పురస్కరించుకొని తహశీల్దార్ సుధీర్ సోమవారం మండలంలోని కోడూరు సముద్ర తీర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కొత్త కోడూరు, రవీంద్రపురం గిరిజన కాలనీ వం టి తీర గ్రామాల్లో పర్యటించారు. ప్రస్తుతం నెలకొన్న తుపాన్ వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని. గాలి వేగం పెరుగు తున్నప్పటికీ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా మత్స్యకారు లు సముద్రం వైపు వెళ్లకూడదని సూచించారు. అవసరమైతే పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తుపాన్ ప్రభావిత గ్రామాల్లోనే ఉండి పరిస్థితులను గమనిస్తుంటారన్నారు. ఆయన వెంట ఆర్ఐ, విఆర్ఒ, రెవెన్యూ సి బ్బంది, తదితరులున్నారు.

తుపాను బాధిత గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:మండలంలో దిత్వా తుపాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాలలో చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇరగనబోయిన శ్రీనివాసరావు, జయవర్ధన్ సేవా ట్రస్ట్ డైరెక్టర్ గంటా వెంకట రవికుమార్, తదితరులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా చైతన్య జ్యోతి ప్రతినిధులు విలుకానిపల్లి, వెంకన్నపాలెం, రవీంద్రపురం, శివరాంపురం, కొల్లిదిబ్బ, గణపతి నగర్ గ్రామాల్లో గిరిజన కుటుంబాలను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుపాను సమయంలో ప్రభుత్వం ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాదం ఎక్కువైనప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

రామ్ తాళ్లూరితో భేటి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండలంలోని జనసేన మండల అధ్యక్షులు సయ్యద్ అక్బర్ బాషా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆహ్వానం రావడంతో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు చదలవాడ హరీష్ కుమార్ సూచనల మేరకు మంగళగిరి పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అక్బర్ బాషా దాదాపు 10యేళ్లుగా పార్టీ కోసం చేసిన కార్యక్రమాలు గురించి, పార్టీ పెద్దలకు వివరిస్తూ నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్ట్ పనులు, జనసేన పార్టీకి ఒక్కటి కూడా మంజూరు చేయలేదని తెలియజేశారు. ఇప్పటికైనా గ్రౌండ్ లెవెల్లో క్రియాశీల నేతలను గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నామినేటెడ్ పోస్టులు, వర్క్

నార్కోటెక్ హబ్ గా నెల్లూరు

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: గతంలో ప్రశాంతమైన వాతావరణంకు నిలయంగా నెల్లూరు ఉండేదని అలాంటి నెల్లూరు నేడు నార్కోటెక్ హబ్‌గా, గంజాయి, డ్రగ్స్ కి నిలయంగా మారిందని ఎమ్మెల్సీ వైసిపి సిటీ ఇన్‌ఛార్జ్ పర్వత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరు రాంజీ నగర్ లోని వైసిపి సిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటెలిజెన్స్ పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, తద్వారా నెల్లూరులో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి బ్యాచ్ హత్యలకు పాల్పడుతున్నారన్నారు. పట్టణంలో 24 గంటలు గంజాయి, మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారని, తద్వారా సామాన్య ప్రజలు ఇల్లు దాటి బయటకు రావాలంటే భయపడుతున్నారన్నారు. బయట ఖైదీలను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించడంతో ఇక్కడ ఉన్న చిన్నపాటి స్థానిక రౌడీలతో వారు గ్యాంగ్ గా ఏర్పడి అంత ర్రాష్ట్రాల నుంచి గంజాయి డ్రగ్స్ దిగుమతి చేసుకొని స్థానిక రౌడీలతో గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ఒరిస్సా నుండి ఆంధ్రాకు గంజాయి డ్రగ్స్ ని దిగుమతి చేసుకొని నెల్లూరులో 30 మంది సభ్యులు 300 మంది డెలివరీ బాయ్స్‌ను ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. కామ్రేడ్ పెంచలయ్యను ఉత్త పుణ్యానికి హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచలయ్యకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నాన్నని వారు చేయబోయే నిరసన కార్యక్రమాలకు వైసీపీ సిటీ నియోజకవర్గం తరఫున పూర్తిస్థాయి మద్దతును తెలియజేస్తున్నా మన్నారు. ఈ హత్యను మా పార్టీకి ఆపాదించడం బాధాకరమన్నారు.